కథ

ఉదయం ఎనిమిది గంటలు..

'అయ్యో! స్కూలుకి టైం అవుతున్నా ఈ పిల్ల ఇంకా నిద్ర లేవలేదు. ఆయన కూడా ఊళ్లో లేరు. ఈ పిల్లని స్కూలుకి పంపి, నేను ఆఫీసుకి వెళ్లేదెప్పుడు? ప్చ్! అనుకుంటూ వాల్ క్లాక్ వైపు చూసిన శాంతి మనసులో టెన్షన్ మొదలయింది. బెడ్రూం వైపు చూసింది. సెకండ్ స్టాండర్డ్ చదువుతున్న ఆమె ఏకైక ముద్దుల పట్టి వంశిక వత్తిగిలి పడుకుని, పెద్ద టెడీబేర్ బొమ్మని కౌగలించుకొని గాఢంగా నిద్రపోతోంది.

★ ★ ★

# చక్రభ్రమణం

## ఎమ్. వెంకటేశ్వరరావు

ప్రతిరోజూ ఉదయమే శాంతికి అవధానం మొదలవుతుంది. నిద్ర లేస్తూనే ఇంటిపనీ, వంటపనీ చేసుకుంటూనే, బద్ధకంగా నిద్ర లేచే పతిదేవుడికి బెడ్ కాఫీ అందించి, మళ్లీ పన్లో జొరపడి, కాన్వెంట్కెళ్లే కూతురికి అన్నీ రెడీ చేసేసరికి... టైము ఎనిమిదవుతుంది. అప్పుడు కూతురు హోం వర్క్ చేసిందో లేదోనన్న విషయం గుర్తొచ్చి... చూశాక గానీ తెలీదు. కూతురు అసలా పుస్తకాన్నే ముట్టుకోలేదని..

తనతో బాటు ఆరుగంటలకి నిద్ర లేపితే ఏడుపు మొదలెడుతుంది. నిద్ర లేచాక...'మమ్మీ! నిన్న హోం వర్క్ చెయ్యలేదు. మిస్ కొడుతుంది. ఈరోజు స్కూలుకి వెళ్లను' అని గారాలు పోతుంది.

ఆ మాటకి శాంతికి బిపి పెరిగి, కోపం మొదలవుతుంటే.. మెల్లగా కంట్రోలు చేసుకోవడానికి, కొంచెం కాఫీ తాగి, కూతురి చేత కాంప్లాన్ తాగించి, హోం వర్కు పుస్తకం తీసుకొని కూతురితో బాటే తనూ కూచుంటే... 'అమ్మా! పోగో ఛానెల్ పెట్టమ్మా... చూస్తూ హోం వర్క్ చేస్తా! అంటున్న కూతురి మీద వచ్చే కోపాన్ని కంట్రోల్ చేసుకుని, అయిష్టంగానే టీవీ ఆన్ చేస్తుంది... కళ్లార్పకుండా టీవీ చూస్తుందే తప్ప పుస్తకం మీద దృష్టి నిలపదు. కొడితే మొండికేస్తుందని, బుజ్జగిస్తూ హోం వర్కు చేయించేసరికి తాతలు దిగొస్తారు.

గబగబా స్నానం చేయించి తీసుకొచ్చి, యూనిఫాం వేసి, తీరా షూస్ వెయ్యబోతుంటే... ఓ ప్రహసనమే మొదలుపెడుతుంది.

''అమ్మా! షూస్లో ఏదో గుచ్చుకుంటోంది. తీసి మళ్లీ తొడుగమ్మా అంటే...'' శాంతి మనసు...

''అసలీ ఆడజన్మ ఎంత శాపగ్రస్తమో? మగమహరాజు చూడు ఏ పనీ పట్టించుకోకుండా... ఎలా గుర్రెట్టి నిద్రపోతున్నాడో? అదృష్టం వుండాలి'' అని తనలో తాను గొణుక్కుంటూ... అసలు పెళ్లి చేసి పంపాక, కూతురు ఎంతో సుఖపడుతోందని కలర్ఫుల్ కలలు కనే తల్లిదండ్రులకేం తెలుస్తుంది? నాలా ఉద్యోగం చేసే ఇల్లాళ్ల అవస్థలు? విమోచనమే లేదా? లేక నేనే తెలుసుకోవడం లేదా? అని ప్రతి రోజూ పలుమార్లు పరిపరి విధాలుగా ఆలోచించి, ఆలోచించి, బదుల్లేని తన ప్రశ్నలకు ఇప్పటికీ తల బద్దలు కొట్టుకుంటూనే వుంటుంది శాంతి అశాంతిగా.

* * *

ఆలోచనల్నుండి శాంతిని ఎవరో ఇవతలికి లాగినట్లు కాలింగ్ బెల్ శబ్దం వినేసరికి... ఢమాల్న తల మీద పిడుగుపడ్డట్లు అనిపించింది. 'పొద్దున్నే గొంతు మీద కూచోవడానికి ఎవరు వచ్చారబ్బా!' అనుకుంటూ విసుగ్గా తలుపు తీసింది.

ఎదురుగ్గా ఆఫీస్ కొలీగ్ భారతిని చూసి తెచ్చిపెట్టుకున్న నవ్వుతో లోపలకి ఆహ్వానించింది.

''ఏమిటి శాంతి? ఇంకా తయారవ్వలేదా? ఇవ్వాళ బస్సుల స్ట్రయికట. త్వరగా బయల్దేరితే ఇద్దరం కల్సి ఒకే ఆటోలో వెళ్లొచ్చు అని వచ్చాను. ఇంకా నీకు పనికానట్లుంది. నేను హెల్ప్ చెయ్యనా?'' అంది లోపలకొచ్చిన భారతి.

ఆమె ఆప్యాయంగా అన్న చివరి మాట చికాకుగా వున్న శాంతి మనసుపై చిరుజల్లు చిలకరించినట్లన్పించింది.

''నువ్వేమి చేయొద్దు కానీ,...రా! కూర్చో...వంశికను స్కూలుకి పంపి వచ్చేస్తాను.''



అంటూ బెడ్రూంలోకి వెళ్లి కూతుర్ని నిద్రలేపడం మొదలుపెట్టింది.

''నిద్రొస్తోంది మమ్మీ! ఇంకొంచెం సేపు పడుకుంటాను. ఐదు నిమిషాలు ప్లీజ్'' చిన్నపిల్ల నిద్రమత్తులో అడుగుతుంటే శాంతి తల్లి మనసుకి 'పోన్లే పాపం' అనిపించినా, బస్సుల స్ట్రయికు గుర్తుకు వచ్చి.....

''లేవరా కన్నా! స్కూలుకి టైం అయింది. అమ్మ ఆఫీసుకి వెళ్లాలి. సాయంత్రం పెందరాళే పడుకుందువుగానీ, లే...బంగారు తల్లివి గదూ!'' అని కూతుర్నెత్తుకుని, బాత్రూంకి వెళుతుంటే....

''అమ్మా! నువ్వు.. ఈరోజు ఆఫీసుకి సెలవు పెట్టు. ఇద్దరం ఇంట్లో వుందాం. డాడీ కూడా లేరు. నేను నువ్వు చెప్పినట్లు తింటాను. నువ్వు రెస్టు తీసుకో'' అంది తల్లి బుగ్గలకు తన లేత పెదిమలదుముతూ....

కూతురి మాటలకు నవ్వాలో, ఏడ్వాలో అర్థం గాని శాంతి... 'వద్దు కన్నా! మమ్మీకి లీవుల్లేవు. ఆదివారం ఇంట్లో వుంటాంగా. ఐదు నిమిషాల్లో నిన్ను రెడీ చెయ్యాలి కమాన్..కమాన్..' అంటుంటే...

వాళ్లిద్దర్నే చూస్తున్న భారతి చిన్నగా నవ్వుకుంది. ఈ ఇంటికి ఆ ఇల్లెదురు మరి.

కూతురికి ఐదు నిమిషాల్లో బ్రష్ చేసి, స్నానం చేయించి, టర్కీ టవల్‌తో ఒళ్లు తుడిచి, హాల్లోకి తీసుకొచ్చింది శాంతి.

'అమ్మా! చలేస్తోంది. త్వరగా యూనిఫాం వెయ్యమ్మా'

గబగబా యూనిఫాం వేసి, కాళ్లకి సాక్సు తొడిగి, షూస్ తగిలించేసరికి చాలు చాలన్నట్టన్పించింది శాంతికి.

'అమ్మా! కాల్లో దురద పెడుతోంది. ఇంకో సాక్స్ వెయ్యమ్మా' అని కూతురనగానే...ఏమీ ఆలోచించకుండా షూస్ విప్పి, సాక్సు దులిపి వేసేసరికి టైము ఎనిమిదన్నర అయింది. ఈసారి శాంతికి నిజంగానే తల తిరుగుతున్నట్లనిపించింది కూతురికి ఇడ్లీ పెడుతూ...

ఉద్యోగం మాని ఇంట్లో కూచుందామంటే, ఇల్లు కట్టడానికి బ్యాంకు నుంచి తీసుకున్న లోను కళ్లముందు కనిపించింది. ఆకాశాన్నంటుతున్న

ధరలకి భార్య భర్తలిద్దరూ కష్టపడాల్సిన అవసరం తమది. ఉన్న ఒక్క కూతుర్ని బాగా చదివించి, పెళ్లి చేసి పంపాలంటే... ఇంట్లో కూచుంటానంటే కుదుర్తుందా.. అని ఆలోచిస్తుంటే...

'అమ్మా! చట్నీ కారంగా వుంది' అని వంశిక నోట్లో ఇడ్లీ ఉమ్మే సరికి శాంతికి చిర్రెత్తి... నోర్మూసుకొని తిను...అని గుడ్లురిమింది. శాంతి కోపం చూసి వంశిక బిక్కమొఖం పెట్టింది.

''శాంతీ! టెన్షన్ పడకు. పాపని నేను రెడీ చేస్తాను'' అంది భారతి.

''మమ్మీ! సాక్సులో మళ్లీ ఏదో గుచ్చుకుంటోంది. వేరే సాక్సు మార్చవా?'' అంటూ వంశిక భయం భయంగా అడిగింది.

శాంతి గబగబా లోపలకి వెళ్లి, మరో సాక్సు తెచ్చి, కూతురి షూస్ విప్పి సాక్సు మార్చింది.

''అమ్మా! షూ లేసు అంత గట్టిగా కట్టొద్దు. కాలు నెప్పిగా వుంది.''


షూ లేస్ వదులుగా కట్టింది.

''ఏంటి మమ్మీ ఇంత లూజుగా కడితే ఎలా నడవను?'' అనేసరికి, శాంతి తలపట్టుకొని....తిరిగి గట్టిగా కట్టింది.

''అన్ని బుక్స్ బ్యాగులో పెట్టుకున్నావా?''

''లేదు మమ్మీ! టైం టేబుల్ ప్రకారం సర్దుకోలేదు. ఏదైనా మిస్సయితే...మిస్ బయట నిలబెడుతుంది.

ఈసారి కూతురు మాటలు విన్న శాంతికి నిజంగానే తల గోడకేసి కొట్టుకోవాలన్నంత కోపం వచ్చింది.



బుక్సన్నీ సర్దుతుంటే... వాకిట్లో స్కూలు ఆటో శబ్దం వినిపించింది. వంశిక బయటకొచ్చి, 'అమ్మా! ఆటో వచ్చింది. తొందరగా రాకపోతే వదిలి వెళ్లిపోతాడు. త్వరగా బుక్స్ తీసుకురా!

ఓ చేతిలో స్కూలు బ్యాగు, మరో చేతిలో లంచ్ బ్యాగు తీసుకొని, కూతుర్ని తీసుకొచ్చి ఆటోలో కూచోపెట్టింది శాంతి.

ఆటో స్టార్టు చేస్తుంటే...

'అమ్మా! టూ... బాత్రూం కెళ్లాలమ్మా!' అంది వంశిక.

శాంతికి ఈ దఫా నిజంగానే తల ఊడి

కిందపడ్డట్టయింది. ఆటో డ్రైవరు ఆమె వైపు పరితాపంగా చూశాడు.

''నేను వెయిట్ చేస్తాన్లేమ్మా! త్వరగా తీసుకురండి'' అన్నాడు పరిస్థితి అర్థం చేసుకొని.

''చూశావా! ఈ అష్టావధానం'' అంది శాంతి.

మళ్లీ యూనిఫాం, షూస్ అన్నీ తీసి, కూతుర్ని టాయ్‌లెట్‌కి తీసుకెళ్లొచ్చి తయారు చేసే సరికి పదినిమిషాలయింది.

ఆటో డ్రైవర్ హారను మోగించి, తను తొందరగా వెళ్లాలన్నట్లు గుర్తు చేశాడు.

''వస్తున్నా బాబూ!''అని గబగబా కూతుర్ని తీసుకొచ్చి ఆటోలో కూచోబెట్టింది.

''జాగ్రత్తరా కన్నా! హోం వర్కు మర్చిపోకుండా రాసుకురా, అన్నం వదలకుండా తినిరా. అర్థమైందా?'' చెప్పింది శాంతి.

''మమ్మీ బై...'' అంటూ ఫ్లైయింగ్ కిస్సిచ్చి చేయి వూపింది వంశిక.

ఆటో సందు దాటే వరకు చెయ్యూపుతూ టాటా చెప్పి లోపలకి వచ్చింది శాంతి. కిచెన్లో కెళ్లి రెండు కప్పుల కాఫీతో వచ్చి భారతికిచ్చి, తను తాగుతూ...

''చూశావుగా! పేరుకి ఒక్కతే పిల్లని గానీ, అది నన్నెంత వేధించుకుతింటోందో? ఇటు ఇంట్లో పని, అటు ఆఫీసులో పని, పోనీ ఓ పనిమనిషిని పెట్టుకుందామంటే వాళ్లు నెలకి ఎనిమిదొందలు ఇస్తావా? వెయ్యి ఇస్తావా? అనడగుతున్నారు. ఆపనేదో.... మనమే చేసుకుంటే.. చన్నీళ్లకీ వేణీళ్లలా వుంటాయని ఆలోచిస్తే, ఈ పిల్ల రాక్షసి ఇలా వేధించుకు తింటోంది'' అంది శాంతి.

''ఇది అందరి ఇళ్లల్లో వుండే సమస్యే శాంతీ! పిల్లలకిది అటు ఇటూ కాని వయస్సు, కాస్త పెద్దయ్యే దాకా తప్పదుమరి.''

''వీళ్లు పెద్ద వాళ్లయ్యేలోపల మనం వృద్ధులం అవడం ఖాయం'' అంది అసహనంగా.

''ఎక్కువగా ఆలోచిస్తున్నావు శాంతీ!''

''నేను చెప్పింది చాలా తక్కువ అసలూ....'' అని ఏదో చెప్పబోతున్న శాంతిని అడ్డుకొని...

''చూడు నీ చిన్నతనంలో మీ అమ్మ నిన్నెంతో గారాబం చేసుంటారు. నువ్వూ ఆమెని ఎంతగానో ఆట పట్టించి వుండొచ్చు. ఇప్పుడు నీ కూతురు నిన్ను డ్యాన్సు ఆడిస్తున్నట్లు ఫీలవుతున్నావు. కానీ రేపు నీ కూతురికి పెళ్లయి దానికి పుట్టే పిల్లలు దీన్ని సర్కస్ ఆడిస్తారు. అదంతా ఓ వయస్సు వరకే. వివరం తెలిశాక వాళ్లని మనం కావాలని అల్లరి చేయమన్నా చెయ్యరు. వాళ్ల పన్లు వాళ్లే చేసుకుంటారు. అసలు నాకు తెలియక అడుగుతాను. దీన్ని నువ్వు సమస్యలా ఎందుకనుకుంటున్నావు? అందరి ఇళ్లల్లో ఇవన్నీ సహజం. మన ఆఫీసులో చూడు పై అధికారి కింది వాళ్లని, వాళ్లు తమ కింద వాళ్లని సతాయించడం లేదూ..అంత మాత్రాన ఉద్యోగం వదిలేస్తున్నామా? అతదాకా ఎందుకు? ఎంతో విసిగించిదంటున్న నీ కూతుర్ని, అది చేసిన అల్లరంతా భరించి స్కూలుకి పంపుతూ ఎన్నో అడ్వయిజులిచ్చి పంపావు. నీ కూతురు నిన్నేడిపించిందంతా మరిచిపోయి, నీకు టాటా చెప్ప ఫ్లయింగ్ కిస్సిచ్చి ఏమీ జరగనట్లు సంతోషంగా వెళ్లింది. నీ కూతురుకి ఆరేళ్ల వయస్సు నీ పాతికేళ్ల మనసుతో ఆలోచించు మరి.

చూడు శాంతీ! జీవితం ఓ చక్రం లాంటిది. దీని లోపల కుటుంబం అనేది మరో చిన్న చక్రం. రెండూ పరిభ్రమిస్తూనే వుంటాయి. ఏది ఆగినా పయనం సాగదు. అన్ని విషయాల్ని భూతద్దంలో చూస్తూ పోతే, ప్రతి చిన్న విషయమూ భూతంలా కనిపిస్తూనే వుంటుంది. ఇదో చక్రభ్రమణం. ఆనాడు మనం బాల్యంలో చేసినవే...ఇవ్వాళ మనపిల్లలు చేస్తున్నవి. కాలంలో వేగం అంతే. టేకిట్ ఈజీ పాలసీ అలవర్చుకుంటే, మనసుని ఏదీ బాధించదు.''

భారతి మాటలు విన్న శాంతి మనసు ఒక్క క్షణం ఆలోచనలో పడింది. తన కూతురు తన ప్రమేయం లేకుండా తన పన్లన్నీ తనే చేసుకొని, తనని విసిగించకుండా స్కూలు కెళ్లిపోతే.. ఉదయం పూట తనకిహ పనేముంటుంది? క్రమంగా తల్లీ కూతుళ్ల అనుబంధం యాంత్రికంగా మారే అవకాశం వుంది. తన కూతురు తన దగ్గర కాకపోతే ఎవరి దగ్గర అల్లరి చేస్తుంది? అంతే....''

భారతి మాటల్లో భావం అర్థమైన శాంతి మనసు భారరహితమైంది.

❑

## 26 కిలోల బరువు తగ్గిన సంజు....

ఫిట్‌నెస్, స్లిమ్‌నెస్ తారలకేమీ కొత్త కాదు. అది వారికి అవసరం కూడా. డైటింగ్, ఎక్సర్‌సైజల ద్వారా బరువు పెరగకుండా చూసుకుంటూ వుంటారు. ఒకవేళ పెరిగినా వెంటనే రెండు మూడు కిలోలు తగ్గడానికి ప్రయత్నిస్తారు. అయితే ఏకంగా **26** కిలోల బరువు తగ్గడం సామాన్యం కాదు. ఇంత బరువు యుద్ధప్రాతిపదికన తగ్గిన బాలీవుడ్ నటుడు ఎవరో కాదు సంజయ్ దత్. జైలు నుంచి బయటకు వచ్చిన సమయంలో ఆయన బరువు చాలా ఎక్కువగా వుండేది. అదే సమయంలో అష్టవినాయక్ సినిమా బహామాస్‌లో ప్రారంభమైంది. దానిలో సంజయ్‌దత్‌తో పాటు అక్షయ్‌కుమార్, దీపికా పడుకునే, మాన్యత కూడా నటిస్తున్నారు. ఈ సినిమాలో సంజయ్ పాత్రకి స్లిమ్‌నెస్ తప్పనిసరి కావడంతో అదే పనిమీద వుండి రికార్డు స్థాయిలో **26**కిలోల బరువు తగ్గి మునుపటి సంజయ్ దత్‌లాగా తయారయ్యాడు. ఈ బరువు తగ్గే కార్యక్రమానికి ఇండియన్ ట్రైనర్లు కాకుండా హాలీవుడ్ ట్రైనర్ లారెన్స్ నేతృత్వం వహించారు. లాస్‌ఏంజిల్స్ నుంచి లారెన్స్ గైడ్ చేస్తుంటే వాటిని తూ.చ. తప్పకుండా పాటించి అనుకున్నది సాధించగలిగాడు. గతంలో రోజుకి ఒకటి లేదా రెండు గంటలు జిమ్‌లో వ్యాయామం చేసే సంజయ్ ఇప్పుడు రోజుకి నాలుగు నుంచి ఐదు గంటలపాటు జిమ్‌లో వ్యాయామం చేస్తున్నట్లు సంజయ్ సిఇఓ ధరమ్ ఒబ్రాయ్ చెప్పారు. వ్యాయమం చేయడమే కాకుండా సంజయ్ డైట్‌లో కూడా చాలా మార్పులు చోటుచేసుకున్నాయని మద్యాన్ని పూర్తిగా మానేసాడని ఒబ్రాయ్ చెప్పారు. బరువు తగ్గిన సంజయ్ కుర్రాడిలా కనపడుతున్నాడని ఆయన ఆనందంతో అన్నారు.

